# రియల్ ఎస్టేట్‌లో సత్యవాణి 40 కోట్ల పెట్టుబడి

బిజినెస్ బ్యూరో, న్యూస్‌లైన్

హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ సత్యవాణి గ్రీన్‌హోమ్స్ ఈ రంగంలో కోటి డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు ప్రణాళికను రూపొందించింది. ఇందులో భాగంగా తన తొలి ప్రాజెక్టును హైదరాబాద్‌కు సమీపంలోని అన్నో జీగూడలో (వరంగల్ హైవేపై) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఉషోదయం గ్రీన్‌హోమ్స్ పేరుతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద గ్రీన్ హోమ్స్ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ అవుతుందని కంపెనీ ఎండీ పి.సూర్యప్రకాశ్ వెల్లడించారు. 12 ఎకరాల స్థలంలో దాదాపు 1800 నివాస గృహాలను ఇక్కడ నిర్మిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణానికి పూర్తిగా అనుకూలంగా ఉండేలా తీర్చిదిద్దుతున్న ఇక్కడి ఇళ్లకు సౌర విద్యుత్తును అందించే ఏర్పాటు కూడా చేస్తున్నట్లు వివరించారు. రహేజా ఐటీ పార్కు, ఇన్ఫోసిస్ కొత్త అభివృద్ధి కేంద్రం ఈ ప్రాంతంలో రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో తమ టౌన్‌షిప్‌కు మంచి మార్కెట్ ఉంటుందన్నారు. మరోవైపు తమ కోటి డాలర్ల పెట్టుబడి ప్రణాళిక మేరకు బేగంపేట, కొండాపూర్, గాగిల్లాపూర్‌లలో మరో మూడు ప్రాజెక్టులను చేపడుతున్నట్లు తెలిపారు. గాగిల్లాపూర్ ప్రాజెక్టులో దాదాపు 107 విల్లాలను నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి ధర రూ. 30 లక్షల నుంచి రూ. 80 వరకు ఉంటుందన్నారు.